సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023

I



క్రేజీ అమ్మకం

వస్త్ర విక్రయాలు కొత్త పంథాలో సాగుతున్నాయి. అన్ని రకాల దుస్తులను ఇప్పుడు కేజీల చొప్పున కూడా విక్రయిస్తున్నారు. - IIలో



ఇళ్ల నిర్మాణాల్లో మూడోస్థానం

గృహ నిర్మాణంలో శ్రీకాకుళం మూడో స్థానంలో నిలిచిందని ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్ తెలిపారు. - IIలో

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన 38 మండలాలకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖల ప్రగతి నివేదికలతో జిల్లా స్థాయి అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

న్యూస్‌రీల్

ఉద్దానంలో ఎలుగు హల్‌చల్



వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతంలో మరోసారి ఎలుగుబంటి సంచరించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గురువారం బాతుపురం రోడ్డుపైకి ఎలుగు రావడం ప్రయాణికులు, స్థానికులు గుర్తించారు. దీంతో భయంతో పరుగులు తీశారు. అధికారులు స్పందించి ఎలుగుల సంచారాన్ని నియంత్రించాలని వారు కోరుతున్నారు.

ఏఓబీలో మంత్రి సీదిరి పర్యటన



ఏఓబీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన బుడారిసింగి పంచాయతీలో గల ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం పర్యటించారు. ఒడిశా ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను మంత్రి పరిశీలించారు. కళింగదళ్ రిజర్వాయర్ ప్రాంతంలో ఒడిశా ప్రభుత్వం ఆంధ్రా ప్రభుత్వం అనుమతుల్లేకుండా బ్రిడ్జి నిర్మాణాలు చేస్తోందని బుడారిసింగి సర్పంచ్ సురేష్‌కుమార్ పాణిగ్రాహి మంత్రికి వివరించారు. తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావులను సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్రా–ఒడిశా అధికారులు చర్చలు జరిపిన అనంతరమే బ్రిడ్జి నిర్మాణం కొనసాగాలన్నారు. ఏకపక్షంగా ఒడిశా అధికారులు చేస్తున్న నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, అధికారులు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో స్వర్ణం



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: కర్నూలు జిల్లా డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9, 10వ తేదీల్లో 43వ ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ట్రెడిషనల్ యోగాసన పోటీల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి గురువారం అభినందించారు.

కురిగాం పీహెచ్‌సీకి కేంద్రం ప్రశంసలు

కొత్తూరు: మండలంలోని కురిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలను కేంద్ర ప్రభుత్వ కుటుంబ సంక్షేమ శాఖ గుర్తించింది. ఈ మేరకు కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీలతకు డీఎంహెచ్‌వో బి.మీనాక్షి ద్వారా గురువారం శ్రీకాకుళంలో ప్రశంసాపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను నాణ్యత ప్రమాణాలతో అమలు చేయడంలో కురిగాం పీహెచ్‌సీ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. వరుసగా మూడో ఏడాది కూడా ప్రశంసాపత్రం అందుకోవడం అభినందనీయమని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బుజ్జిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైకి వరద నీరు



బదనాపురం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వంశధార నీరు

కొత్తూరు: వంశధార నది ఉధృతంగా ప్రవహించడంతో గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మాతల, అంగూరు, కుద్దిగాం, పీఎస్‌పురం, ఆకులతంపర, మాకవరం తదితర గ్రామాల్లో పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. మాతల, మనాపురం, ఆకులతంపర, నివగాం గ్రామాల వద్ద రోడ్లపైకి వరద నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. విషయం తెలుసుకున్న తహశీల్దార్ చక్రవర్తి, ఎస్‌ఐ మహమ్మద్ అజాద్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు వరద ముంపు గ్రామాల్లో పర్యటించారు. ఆకులతంపర ఇసుక ర్యాంపు వద్ద జేసీబీలు నీట మునిగాయి.

ఓబీసీలో చేర్చండి







ఎన్‌సీబీసీ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, అనూషా శశిధర్‌పట్నాయక్ తదితరులు

- ఢిల్లీలో జరిగిన ఓబీసీ పబ్లిక్ హియరింగ్‌లో జిల్లా వాణి
- తూర్పుకాపు, కళింగ వైశ్య, శిష్టకరణ, సొండి, అరవ కులాలను ఓబీసీలో చేర్చాలని డిమాండ్
- జిల్లా గళం వినిపించిన ఎంపీ బెల్లాన, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, కార్పొరేషన్ చైర్మన్లు
- కుల సంఘాల నాయకులతో కలిసి వాదనలు వినిపించిన వైఎస్సార్‌సీపీ నేతలు



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లాలో వెనకబడిన తూర్పుకాపు, కళింగ వైశ్య, శిష్టకరణ, సొండి, అరవ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆయా కులాల తరఫున వైఎస్సార్‌సీపీ నాయకులు ఢిల్లీలో గట్టిగా తమ వాణి వినిపించారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, సంక్షేమ కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, కంటి మహంతి అనూష శశిధర్ పట్నాయక్ , రాష్ట్ర కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు కోణార్క్ శ్రీను తదితరులు పెద్ద ఎత్తున హాజరై జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్(ఎన్‌సీబీసీ) చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం జహీర్ వద్ద తమ వాదనలు వినిపించారు. జిల్లాలో ఐదు కులాల జాతీయ గుర్తింపు కోసం రెండు రోజులుగా ఢిల్లీలోనే తిష్ట వేసి, ఆ కులాలను ఓబీసీలో చేర్చాలని అందరి తరఫున వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు ముందుండి విజ్ఞప్తి చేశారు. వీరితో పాటు ఎంపీలు రామ్మోహన్‌నాయుడు, జీవీఎల్ నర్సింహరావు, సంబంధిత కులసంఘాల నాయకులు హాజరై వినతిపత్రాలు అందజేశారు.

జిల్లావాసుల సందడి..

జిల్లాలోని తూర్పు కాపు, కళింగ, శిష్టకరణ, సొండి, అరవ కులాలను ఓబీసీలో చేర్చాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉంది. రాష్ట్రంలో బీసీలుగా చెలామణి అవుతున్నా జాతీయ స్థాయిలో గుర్తింపు లేకపోవడంతో వారికి న్యాయం జరగడం లేదు. ఇప్పటికే పలుమార్లు జిల్లా ప్రజాప్రతినిధులు ఢిల్లీ వెళ్లి సంబంధిత మంత్రులు, ఇతర అధికారులను కలిసి ఓబీసీలో చేర్చాలని విజ్ఞప్తులు, వినతిపత్రాలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా విన్నవించింది. వీటిన్నింటిని దృష్టిలో ఉంచుకుని జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్ ఢిల్లీలో పబ్లిక్ హియరింగ్ నిర్వహించింది. దీంతో మన జిల్లాకు చెందిన నాయకులు భారీగా తరలివెళ్లారు. ఢిల్లీలో జిల్లా వాసుల సందడే ఎక్కువగా కన్పించింది. ఏకంగా పబ్లిక్ హియరింగ్‌లోనే మన జిల్లా మార్క్ స్పష్టంగా కన్పించింది.

పక్కా వివరాలతో..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన కార్పొరేషన్ చైర్మన్‌లు ఐదు రోజుల ముందుగానే అమరావతిలో తయారు చేసుకున్న పక్కా వివరాలతో కూడిన డాక్యుమెంట్లతో హియరింగ్‌కు హాజరయ్యారు. వాటిన్నింటినీ కమిషన్ ముందు సమర్పించారు. కులాల వెనుకబాటు తనాన్ని ఒక్కొక్కరు వివరించారు. ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, కంటి మహంతి అనూష శశిధర్ పటాన్యక్, కుల సంఘాల నాయకులు కోణార్క్ శ్రీను, పల్లా వెంకటరావు, తుమరాడ శ్రీనివాసరావు, గొర్లె శ్రీనివాసులనాయుడు, బలగం సేతు బందు సీతారాం, సరిపిడకల రామారావు, పొట్నూరు గణేష్‌కుమార్, దేవరశెట్టి శ్రీరామమూర్తి, సకలాబత్తుల ప్రసాదరావు, సానా షణ్ముఖరావు, ఊణ్ణ మోహన్‌రావు, తంగుడు నాగేశ్వరరావు, పి.వి.సతీష్‌కుమార్, మల్లా కృష్ణారావు, తంగుడు వైకుంఠరావు, శిష్టకరణ సంఘం నాయకులు ఎస్‌ఎస్‌కే మహంతి, ఆరికతోట చంద్రమౌళి, వెంకటేశ్వర బెనర్జీ, పోలు మహంతి ఉమామహేశ్వరరావు, రత్నాల కాశీ విశ్వనాథ్ చౌదరి, నల్ల నాగేశ్వరరావు, బంగారం బండి రవిచంద్ర, రత్నాల దేవరాజు, గజపల్లి నాగభూషణం తదితరులంతా అక్కడే ఉండి తమ డిమాండ్‌ను స్పష్టంగా వివరించారు. ఓబీసీ లేకపోవడం వల్ల తమ సామాజిక వర్గాలు ఏ రకంగా నష్టపోతున్నారో తెలియజేశారు.

ఎట్టకేలకు కదలిక..

శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ అనేక సార్లు ఢిల్లీ వెళ్లి స్థితిగతులను వివరించాం. గత ప్రభుత్వాలేవీ స్పందించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేసింది. దీంతో ఓబీసీ విషయంలో కదలిక వచ్చింది. ప్రత్యేకంగా కమిటీ వేసి ఎంపీలు, కేంద్రమంత్రులు చొరవ చూపించడం ఆనందంగా ఉంది.

– పోలుమహంతి ఉమామహేశ్వరరావు, శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కేంద్రం సానుకూలం..

ఒడిశా నుంచి వలస వచ్చి చిరువ్యాపారాలు చేసుకుని ఉత్తరాంధ్రలో స్థిరపడ్డ కళింగవైశ్యులను ఓబీసీ జాబితాలో చేర్చడం వల్ల ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్థికంగా, సామాజికంగా, విద్యా పరంగా ఇబ్బందులు పడుతున్న తమ కులానికి చాలా ఉపయోగకరం. రాష్ట్రప్రభుత్వం సిఫార్సు మేరకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఎన్‌సీబీసీ చైర్మన్ సమక్షంలో పబ్లిక్ హియరింగ్ పెట్టి కులాల స్థితిగతులు తెలుసుకుంది. ఓబీసీ జాబితాలో చేరిస్తే బతుకులు బాగుపడతాయి.

– అంధవరపు సూరిబాబు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్

సీఎం వైఎస్ జగన్ కృషి అభినందనీయం

- తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్



మాట్లాడుతున్న మామిడి శ్రీకాంత్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలైన తూర్పుకాపు, శిష్టకరణ, కళింగవైశ్య, సొండి, అరవ కులాలకు ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడం అభినందనీయమని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేని అంశం కావడంతో ఇప్పటికే పలుమార్లు సిఫార్సు చేయడంతో బుధవారం ఢిల్లీలో ఎన్‌సీబీసీ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం పబ్లిక్ హియరింగ్ సమావేశం నిర్వహించారు. అందులో శ్రీకాంత్ పాల్గొని చైర్మన్‌తో మాట్లాడుతూ ఆయా కులాల స్థితిగతులను వివరించారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 199 బీసీ కులాలున్నాయని, అందులో 38 కులాలు ఓబీసీకి నోచుకోలేదన్నారు. గత ప్రభుత్వం బీసీ కులాల పట్ల నిర్లక్ష్యం వహించిందని, 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వెనుకబడ్డ కులాల అభివృద్ధికి సాయమందిస్తునే ఉందన్నారు. ఓబీసీలో చేర్చేందుకు జీవీఎల్ నరసింహం సైతం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మంత్రులు చెల్లుబోయిన, ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణలు తమవంతు సహకారం అందించడం వల్లే ఓబీసీ అంశం ముందుకెళ్తోందన్నారు. పార్లమెంట్‌లో ఓబీసీ ఫైల్‌ను ఆమోదించి వెనుకబడిన వర్గాలకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో కళింగవైశ్యకుల నగర అధ్యక్షుడు ఊన్న నాగరాజు, సొండికుల సంఘం అధ్యక్షులు షావుకారి నాగేశ్వరరావు, రత్నాల నరసింహమూర్తి, బబ్బోది చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.8.87 లక్షల టోకరా

- సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కుకున్న ఆమదాలవలస యువకుడు
- లావాదేవీలను ఫ్రీజ్ చేయించిన బ్యాంకు వర్గాలు



శ్రీకాకుళం క్రైమ్/ఆమదాలవలస : సైబర్ నేరగాళ్ల వలలో మరో యువకుడు చిక్కుకుని డబ్బులు పోగొట్టుకున్నాడు. ఆమదాలవలస పట్టణంలో ఎమ్మెస్సీ బీఈడీ చదివి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఓ యువకుడు (తన తండ్రి రిటైరవ్వగా వచ్చిన సొమ్ముతో) ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పేరిట దఫదఫాలుగా రూ. 8.87 లక్షలు కట్టి మోసపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడు, ఆమదాలవలస ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు .. యువకుడికి ఈ నెల 6న వాట్సాప్‌లో ఫ్రీ లాన్సింగ్ పార్ట్‌టైం జాబ్ (ఆన్‌లైన్) అంటూ మెసేజ్ (7029075733) వచ్చింది. అది బిట్ గెట్ కంపెనీ, సింగపూర్ అని ఉంది గానీ లోకల్‌దే. అందులో పది పెడితే ఇరవై.. ఇరవై పెడితే ముప్పై రావడంతో స్టాక్ మార్కెట్ మాదిరి అధికారకమని భావించి క్లిక్ చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఫ్రీలాన్సింగ్ పేరిట పార్ట్‌టైం జాబ్ చేస్తున్న నలుగురు గుర్తు తెలియని వ్యక్తులను కంపెనీ ఎంటర్ చేసింది. బాధితుడి నెంబర్‌ను టెలిగ్రామ్, వాట్సాప్ యాప్‌ల్లో వారే యాడ్ చేశారు. వారంతా బిట్ గెట్ ప్రతినిధులమంటూ.. మీరు కూడా ఈ రోజునుంచి చేరారంటూ నమ్మించారు. కొన్ని టాస్కులు ఉంటాయని చెప్పగా మొదట రూ. 2 వేలు పంపించగా రూ.2,800 ట్రేడింగ్ రివ్యూ చూపించింది. వెంటనే అమౌంట్ టైప్ చేసి విత్‌డ్రా కొట్టగా అమౌంట్ బాధితుని ఖాతాలో క్రెడిట్ అయ్యింది. కాసేపటికి రూ. 5 వేలు పంపగా రూ.6,800 ఖాతాలో క్రెడిట్ అయ్యింది. బాధితునికి నమ్మకం కుదిరింది. ఎక్కువ ఇన్వెస్టు చేస్తే మరింత ఎక్కువ వస్తుందని నమ్మించడంతో రూ. 2 లక్షలు, మరుసటి రోజు రూ.1.87 లక్షలు ఇన్వెస్ట్ చేయించారు. ట్రేడింగ్ రివ్యూ పరిశీలించగా అదనపు సొమ్ము కనిపిస్తున్నా విత్‌డ్రా కాకపోవడంతో గ్రూపు సభ్యులను సంప్రదించాడు. వారు మభ్యపెట్టి యువకుడితో మరో రూ. 5 లక్షలు అకౌంట్‌లో వేయించుకున్నారు. 8వ తేదీన మరో రూ.5 లక్షలు వేశాడు. ఎంతకూ క్రెడిట్ కాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు అదే రోజు ఎస్‌బీఐ బ్రాంచిలో ఫిర్యాదు చేశాడు. అనంతరం బ్యాంకు ప్రతినిధులు బాధితుని ఖాతాలో అన్ని లావాదేవీలను బ్లాక్ చేసి మోసగాళ్ల అకౌంట్లను ఫ్రీజ్ చేశారు. బుధవారం రాత్రి బాధితుడు ఆమదాలవలస పోలీసులను ఆశ్రయించాడు.



23న రెడ్‌రన్ మారథాన్

అరసవల్లి: ఎయిడ్స్‌పై అవగాహన పెంచే క్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ, జిల్లా వైద్యారోగ్య శాఖల సంయుక్త నిర్వహణలో ఈ నెల 23న స్థానిక 80 ఫీట్ రోడ్డులో 5కే రెడ్ రన్ మారథాన్-2023 నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షి తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభం కానున్న ఈ మారథాన్‌లో 17–25 ఏళ్ల యువత హాజరుకావచ్చని పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు, మరో ఏడుగురికి ప్రోత్సాహక బహుమతులుగా రూ.1000 చొప్పున అందజేస్తామని తెలిపారు. ఈ నెల 22లోగా 9494474266 నంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

జిల్లాకు వరద ముప్పు!



గొట్టా బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరదనీరు

- లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయండి
- అధికారులకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశం



టెలి కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో నదులు పొంగే అవకాశం ఉందని, ఇటీవల జిల్లాలో పాటు ఒడిశాలోనూ అధిక వర్షాలు కురవడంతో నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు రావచ్చని, ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా వరద ముంపు ప్రాంతాలపై అధికారులను కలెక్టర్ అప్రమత్తం చేశారు. లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, ఆస్తి, ప్రాణనష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వంశధార నదికి 72 వేల క్యూసెక్కుల నీరు చేరిందని, మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారని తెలిపారు. ఇది రాత్రికి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా కొత్తూరు, భామిని, హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, పోలాకి, ఆమదాలవలస, జలుమూరు, నరసన్నపేట మండలాల తహసీల్దార్లు వారి పరిధిలోని ముంపు ప్రాంతాల్లో చాటింపు వేయాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 08942-240557 నంబరు ఏర్పాటు చేశామన్నారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా కాశీనగరం నుంచి నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున వంశధార నదిలో నీరు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, నీటిపారుదల శాఖ, విపత్తుల నివారణ సంస్థ, తదితర శాఖ సిబ్బంది ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలన్నారు. ఎంఎస్‌ఓల ద్వారా కేబుల్ టీవీల్లో కంట్రోల్ రూమ్ నంబర్ ప్రసారం చేయించాలన్నారు. నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావుతో మాట్లాడుతూ వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. వలంటీర్ల సేవలు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాధిక, డి.ఆర్.ఓ.గణపతి, శ్రీకాకుళం, టెక్కలి, పలాస ఆర్‌డీఓలు, తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉధ్ధృతంగా నాగావళి

బూర్జ: నాగావళి నదిలో వరద నీరు భారీగా వచ్చి చేరడంతో ప్రవాహం ఉధృతంగా సాగుతోంది. నాలుగు రోజులుగా పడిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నీరు చేరడంతో ప్రవాహం ఎక్కువైంది. దీంతో నదీ తీర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.



బూర్జ వద్ద నాగావళి నదీ ప్రవాహం


వంశధారలో వరద

- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

హిరమండలం: హిరమండలంలో వంశధార గొట్టాబ్యారేజీ వద్ద గురువారం వరదనీరు పెరిగింది. ఒడిశా కేచ్‌మెంట్ ఏరియాలో పడుతున్న తేలికపాటి వర్షాలకు వంశధారలో భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 36.73 మీటర్ల నీటి మట్టం ఉంది. గురువారం ఉదయం 10 గంటలకు 40 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో వంశధార అధికారులు అప్రమత్తమై మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 17 గేట్లు పైకి ఎత్తి నీటిని విడిచిపెట్టారు. ఉదయం 11 గంటల వరకు 56,809 క్యూసెక్కులు రాగా సాయంత్రానికి 73,770 క్యూసెక్కులకు చేరింది. నది నుంచి 69,761 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నట్లు ఇన్‌చార్జి డీఈ వై.అనిల్‌కుమార్ తెలిపారు. ఎడమ, కుడి ప్రధాన కాలువకు నీరు వెళ్లకుండా నిలిపివేసినట్లు చెప్పారు. వరద నీటి ఉధృతిని వంశధార ఈఈ డీఎస్ ప్రదీప్ పరిశీలించారు.

వంశధార రూపకర్తకు వందనం

- ఇంజనీర్ల ప్రతిభా పాటవాలకు నిలువెత్తు నిదర్శనం సీఆర్‌ఎం పట్నాయక్
- నేడు ఇంజనీర్ల దినోత్సవం



సీఎంఆర్ పట్నాయక్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచం పురోభివృద్ధి సాధిస్తోంది. మన దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో సాంకేతిక ప్రగతి కళ్ల ముందు కనిపిస్తోంది. ఇదంతా ఇంజినీర్ల గొప్పతనం. అందుకు నిలువెత్తు సాక్ష్యంగా జిల్లాలోని వంశధార ప్రాజెక్టు నిలిచింది. లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే ప్రాజెక్టుగా జిల్లాకే తలమానికంగా నిలిచింది. దీంట్లో మన జిల్లా ఇంజినీర్ల ప్రతిభే దాగి ఉంది. ఇంజినీర్ల ప్రతిభా పాటవాలకు మన దగ్గర కొదవ లేదని 50 ఏళ్ల క్రితమే నిరూపించారు నరసన్నపేట మండలం చిక్కాలవలసకు చెందిన చిక్కాలవలస రాధామోహన్(సీఆర్‌ఎం) పట్నాయక్. జిల్లాను సస్యశ్యామలం చేస్తూ 2.50 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీటిని అందిస్తున్న వంశధార ప్రాజెక్టు(గొట్టా బ్యారేజీ) రూపకర్త ఆయనే. నేడు ఇంజనీర్ల దినోత్సవం..అక్టోబర్ రెండో తేదీన ఆయన 100 జయంతి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పుడాయన్ని ఒక్కసారి గుర్తు చేసుకుందాం.

గొట్టా బ్యారేజీ డిజైనర్‌గా..

నరసన్నపేట మండలం చిక్కాలవలసకు చెందిన చిక్కాలవలస రాధామోహన్(సీఆర్‌ఎం)పట్నాయక్ వంశధార ప్రాజెక్టు నిర్మాణానికి ఎనలేని కృషి చేశారు. 1954లో గొట్టా దగ్గర బ్యారేజీ నిర్మాణం చేసినట్టయితే 32వేల ఎకరాల వ్యవసాయ భూమి, 30 గ్రామాలు పూర్తిగా, 32 గ్రామాలు పాక్షికంగా ముంపునకు గురయ్యే విధంగా అప్పటి ఇంజనీరింగ్ అధికారుల ప్రణాళికకు భిన్నంగా తక్కువ ఎకరాలను ముంపునకు గురయ్యేలా ప్రాజెక్టు డిజైన్ చేశారు. 1964–65లో నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఈఈగా పనిచేస్తుండగా బదిలీపై ఇక్కడికొచ్చిన సీఆర్‌ఎం పట్నాయక్ వంశధార ప్రాజెక్టుకు నమూనాలను ప్రభుత్వ ఆదేశాల మేరకు తయారు చేశారు. కేవలం 10వేల ఎకరాలు మాత్రమే ముంపునకు గురయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రతిపాదనే కార్యరూపం దాల్చింది. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. బ్యారేజీ పనులు స్వయంగా పర్యవేక్షించారు. ఒడిశా ప్రభుత్వం అడుగడుగునా అభ్యంతరం చెబుతున్న కారణంగా నేరడికి సమీపంలో సైడ్ వ్యూయర్ కట్టి సాగునీటిని అందించే ప్రాజెక్టును కూడా సీఆర్‌ఎం పట్నాయక్ డిజైన్ చేశారు.

అనేక విశిష్టతలు

1980లో వచ్చిన భారీ వరదలకు ఆయన వరద పరిస్థితి సమగ్రంగా పరిశీలించేందుకు గొట్టా బ్యారేజీ వద్దకు వచ్చారు. అక్కడి నుంచి తిరిగి వెళ్లేందుకు దారి లేక పక్కనే ఉన్న కొండలపై నుంచి కాలి నడకన రెండు రోజులు ప్రయాణం చేసి నరసన్నపేటకు చేరుకున్నారు. ప్రకాశం బ్యారేజీలో క్లిష్టమైన సాంకేతిక సమస్యను పరిశీలించి, భద్రతకు తానొక పరిష్కారం చూపించారు. అనకాపల్లి వద్ద తాండవ ప్రాజెక్టు సాంకేతిక సమస్యలకు కూడా పరిష్కారం చూపారు. నాగావళి, వంశధార నదుల అనుసంధానం ప్రతిపాదన కూడా ఆయనే చేశారు. ఉమ్మడి జిల్లాలోని మరికొన్ని ప్రాజెక్టులకు ప్రతిపాదనలు రూపొందించారు. అనేక సాంకేతిక సెమినార్లలో ఉపన్యాసాలు చేసి ఎంతో మంది యువ ఇంజినీర్లకు మెలకువలు నేర్పారు. ఆయన కుమారుడు కూడా ఒడిశా ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేశారు. 1924 అక్టోబర్ 2న జన్మించిన సీఆర్‌ఎం పట్నాయక్ 2017 మే 11న తుదిశ్వాస విడిచారు. అక్టోబర్ 2న ఆయన 100వ జయంతి.

క్లుప్తంగా

17న జిల్లా ఖోఖో సంఘ సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ:జిల్లా ఖోఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశంతోపాటు నూతన కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 17న నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిట్టి నాగభూషణం, సాధు శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని బలగ మెట్టు వద్ద ఉన్న భారతి ఐటీఐ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 నుంచి సమావేశం జరుగుతుందన్నారు. ఖోఖో సంఘ ముఖ్య నాయకులు, కార్యవర్గ సభ్యులు, క్రీడాకారులు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9441914214 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉద్దానం యువకుడి ప్రతిభ


మల్లేన జీవనరావు

మందస: పేదింటి యువకుడు కస్టమ్స్ అధికారిగా ఉద్యోగం సాధించాడు. మందస మండలంలో ఉద్దాన ప్రాంతమైన నారాయణపురం గ్రామానికి చెందిన మల్లేన జీవనరావు సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో కస్టమ్స్ అధికారిగా ఎంపికయ్యాడు. సామాన్య పేద కుటుంబానికి చెందిన జీవనరావు 10వ తరగతి వరకు ఏపీఆర్ఎస్(అమలాపురం)లో చదివిన అనంతరం ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇంటర్‌మీడియట్‌ను ప్రైవేటు కళాశాలలో చదివారు. బీటెక్ పూర్తి చేశాక టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తునే ఎస్ఎస్‌సీ సీజీఎల్-2022 పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని కస్టమ్స్ అధికారిగా ఉద్యోగం సాధించారు. జీవన్‌రావును గురువారం స్థానికులు అభినందించారు.

ప్రతిఒక్కరూ రక్తదాతలు కావాలి


రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం(పీఎన్ కాలనీ): ప్రతి ఒక్కరూ రక్తదాతలు కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. 56వ ఇంజనీర్స్‌డే పురస్కరించుకుని బీఆర్ఆర్ వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు ఆధ్వర్యంలో జిల్లా రెడ్ క్రాస్ నేతృత్వంలో ఇరిగేషన్ ఇంజనీర్లు రక్తదానం చేశారు. స్థానిక వంశధార ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన రావు, డీఈఈలు, రెడ్‌క్రాస్ సభ్యులు నిక్కు అప్పన్న, బి.చిన్మయరావు, కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, బాబ్జీ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: పాలకొండరోడ్డులో ఓ దుకాణంలో అమ్మకానికి కట్‌పీసులను సిద్ధం చేస్తూ..



వస్త్ర ప్రపంచం ▸ క్రేజీ అమ్మకం

- కేజీల లెక్కన వస్త్రాల అమ్మకాలు
- అందుబాటులో అన్ని రకాలు బ్రాండ్‌లు
- జిల్లా కేంద్రంలో ఐదు దుకాణాలు
- కొలతలు ఇస్తే చాలు.. డ్రెస్ సిద్ధం
- మంచి ఉపాధి అంటున్న విక్రయదారులు


గొడౌన్‌లో వస్త్రాలను సిద్ధం చేస్తున్న మహిళ

శ్రీకాకుళం డెస్క్:

బంగారం గ్రాముల్లో కొంటాం..

కూరగాయలు కేజీల్లో కొనుగోలు చేస్తాం..

నీరు లీటర్లలో కొంటాం..

వస్త్రాలు మీటర్లు లెక్కన కొంటాం..

కానీ శ్రీకాకుళంలో ఇదే వస్త్రాల్ని కేజీల్లో అమ్ముతారు. షాపింగ్ మాల్‌లో అప్పుడప్పుడు ఏర్పాటు చేసే శారీ మేళాల్లో కాదండోయ్..! పురుషులు ధరించే చొక్కా ప్యాంట్లకు సంబంధించిన వస్త్రాల్నే తూకంతో విక్రయిస్తారు. కాటన్ అయినా..లినెన్ అయినా.. పాలిస్టర్ అయినా.. సింథటిక్ అయినా.. బ్రాండ్ ఏదైనా.. కిలోల లెక్కన కొనుగోలు చేయాల్సిందే. కొనుగోలు మాత్రమే కాదు.. మీ ఆకృతికి అనుగుణంగా చక్కగా వస్త్రాలు కుట్టిమరీ అందజేస్తున్నారు ఈ దర్జీలు.

ఉపాధి కోణం..

నగరంలో ఐదు వరకు విక్రయ కేంద్రాలున్నాయి. అమ్మకందారులు, దర్జీలు కలిపి 100 మంది వరకు ఈ వ్యాపారంపై ఆధారపడి బతుకుతున్నారు. కిలో ధర రూ.700 నుంచి రూ.900 వరకు ఉంది. సూరత్, బెంగళూరు, ముంబై, ఢిల్లీలలోని మిల్లుల నుంచి డీలర్ల ద్వారా వీరు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. 'మేం విక్రయించే వస్త్రాలపై పూర్తి అవగాహన ఉండే వారు మాత్రమే మా దగ్గరకు రెగ్యులర్‌గా వచ్చి కొనుగోలు చేస్తుంటారు. రెడీమేడ్ ధరించడం ఇష్టం లేని వారు మా కస్టమర్లలో అధికం' అని చెప్పారు విక్రయదారు రమ్య.

డిమాండ్ బాగుంది..



తక్కువ ధరకు నాణ్యమైన వస్త్రాలు అందించడంతో పాటు ఇక్కడే కుట్టి ఇస్తున్నాం. అన్ని బ్రాండ్‌లతో పాటు కాటన్, పాలిస్టర్, లినెన్ వస్త్రాలకు మా దగ్గర డిమాండ్ బాగానే ఉంది. మేం వస్త్రాలు విక్రయాలతో పాటు దర్జీ పని చేస్తున్నాం. మరికొంతమందికి ఉపాధి కల్పిస్తున్నాం. నగరంలో 100 మంది వరకు ఉపాధి పొందుతున్నారు.

– ఐ.సాగర్, విక్రయదారు

మూడేళ్ల నుంచి ఇక్కడే..



నేను మూడేళ్లుగా వస్త్రాలు ఇక్కడే కొనుగోలు చేస్తున్నా. అన్ని బ్రాండ్‌లతో సమానంగా నాణ్యమైనవి విక్రయిస్తున్నారు. నచ్చిన వస్త్రాల్ని కిలోల లెక్కన కొనుగోలు చేసి దుకాణదారులే బట్టలు కుట్టి అందజేయడం బాగుంది.

– బెహరా సింగ్, కొనుగోలుదారుడు

నిమిదేళ్ల క్రితం ప్రారంభించా..



శ్రీకాకుళంలో తూకానికి వస్త్రాలు కాన్సెప్ట్‌ను ఎనిమిదేళ్ల క్రితం నేనే ప్రారంభించా. అద్భుతంగా నడిచింది. కరోనా కారణంగా రెండేళ్లు కొంచెం ఇబ్బందులు తప్పలేదు. ప్రస్తుతం ఫర్వాలేదు. కస్టమర్లకు అతి తక్కువ ధరల్లో నాణ్యమైన వస్త్రాల్ని అందిస్తున్నాం. ఆదరణ బాగుంది.

– జి.రవి, విక్రయదారు

షాపింగ్ మాళ్లలో..

ఆషాడం సేల్.. శ్రావణం సేల్.. పేరుతో నగరంలోని పెద్ద పెద్ద వస్త్రదుకాణాలు శారీ మేళాలు ఏర్పాటు చేస్తున్నాయి. మగువలు ఎంచుకున్న చీరల బరువును బట్టీ రేటు నిర్ణయించి కేజీల లెక్కన రేటు వసూలు చేస్తున్నారు. కాటన్ చీరలైతే నాలుగు నుంచి ఐదు వరకు తూగుతున్నాయి. కొంచెం బరువుండేవి మూడు వరకు.. హెవీ వర్క్ ఉండేవైతే రెండు.. ఒక్కోసారి ఒకటి కూడా ఆ బరువుకు సరిపోతున్నాయి. వీటికి డిమాండ్ బాగానే ఉంది.


వస్త్రాలను తూకం వేస్తున్న దుకాణదారు రమ్య

నగరంలో ఎక్కడెక్కడ.. నగరంలో పాలకొండ రోడ్, రైతుబజార్ సమీపంలో ఈ వస్త్ర విక్రయ దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలకు ఆనుకునే గోడౌన్‌లు, టైలరింగ్ సదుపాయాలున్నాయి. దుకాణాల నిర్వహణ బాధ్యతల్ని మహిళలే చూస్తుండడం విశేషం.

ఇళ్ల నిర్మాణాల్లో మూడో స్థానంలో శ్రీకాకుళం

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం నవ రత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా 30 లక్షల గృహ నిర్మాణ పట్టాలు పంపిణీ చేశారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్ తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి గృహనిర్మాణ అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి మాట్లాడారు. లక్ష్య సాధనలో వెనుకంజ వేసే సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహనిర్మాణ ప్రగతిలో శ్రీకాకుళం జిల్లా మూడో స్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఒకేసారి రూ.15 వేల కోట్లతో ఇళ్లు నిర్మించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాకు మంజూరైన 75,840 గృహాల్లో 25 వేలు నిర్మాణం పూర్తయ్యాయని వివరించారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.5వేల కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. పారదర్శకంగా సేవలు అందించటంలో తమ శాఖ అగ్రస్థానంలో ఉంటుందన్నారు. సమావేశంలో సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతి, డ్వామా పీడీ చిట్టిరాజు , మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా అధికారులు ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ నాగేశ్వరరావు, అర్బన్ సహాయ ఇంజినీర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల నిర్వహణ నిధులు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డిగ్రీ పరీక్షల నిర్వహణ ఖర్చుల నిధులు విడుదల చేసినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు చెప్పారు. విశ్వవిద్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. నవంబర్ 2022 ఏడాదిలో జరిగిన డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్లు, ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరిగి డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్లుకు సంబంధించి రూ. 27.40 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది జూన్, జూలైలో జరిగిన నాలుగు (సప్లమెంటరీ), ఆరు సెమిస్టర్లతో పాటు ఆగస్టులో జరిగిన రెండు, నాలుగు సెమిస్టర్లకు రూ.11.01 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. మూల్యాంకన శిబిరాలు, పరీక్ష కేంద్రాల నిర్వాహకుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతాయని చెప్పారు.

కూనకు అస్వస్థత

ఆమదాలవలస: ప్రభుత్వ మాజీ విప్ కూన రవికుమార్ అస్వస్థతకు గురయ్యారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆమదాలవలస పట్టణంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలో గురువారం సరుబుజ్జిలి మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. వారికి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన రవికుమార్ మాట్లాడుతూ ఒక్కసారి కళ్లు తిరిగా సొమ్మసిల్లారు. వెంటనే పార్టీ శ్రేణులు ఆయన్ను శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పార్టీ నాయకులు చెబుతున్నారు.

మహిళపై దాడి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కృష్ణాపార్కు వద్ద ఓ మహిళపై వ్యక్తి దాడి చేసినట్టు శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. కృష్ణా పార్కులో నివాసముంటున్న వివాహితకు తారాశి కాశి అనే వ్యక్తితో కొంతకాలంగా కుటుంబ పరిచయముంది. ఫోన్ చేస్తున్నా స్పందించకపోవడంతో గురువారం కృష్ణా పార్కు వద్ద దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు వివాహిత స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

శివసాగర్ బీచ్‌లో యువకుడు గల్లంతు


గోపాల్ మోగ్యాల్(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరంలో సముద్ర స్నానానికి దిగి రాజస్థాన్‌కు చెందిన యువకుడు గోపాల్ మోగ్వాల్(30) గల్లంతయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలమేరకు....గోపాల్ నలుగురు స్నేహితులతో కలిసి గురువారం సాయంత్రం శివసాగర్ తీరానికి చేరుకున్నాడు. కొద్ది సేపు తీరంలో గడిపి సముద్ర స్నానానికి దిగారు. భారీ అల తాకిడికి గల్లంతయ్యాడు. తోటి స్నేహితులు హాహాకారాలు చేసి కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. కాగా గల్లంతైన యువకుడు రాజస్థాన్‌కు చెందిన వలస కూలీ. మరికొంత మంది కూలీలతో కలిసి నందిగాం మండలం దీన బంధుపురంలో నివాసం ఉంటూ స్థానిక గ్రానైట్ కంపెనీలో పని చేస్తున్నాడు. బీచ్‌లో ఇటీవల పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ వారికి తెలుగు భాష రాకపోవడంతో లోతట్టు ప్రాంతానికి స్నానానికి దిగడంతో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఎస్ఐ మధుసూదన్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మిపురంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బొమ్మాళి గణపతిరావు (45) మృతి చెందాడు. తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకుని జాతీయ రహదారిపై వేరే వ్యక్తితో మాట్లాడుతుండగా సారవకోట నుంచి పాతపట్నం వైపు వెళ్తున్న వ్యాన్ ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. తలకు బలమైన గాయం కావడంతో గణపతిరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య పార్వతి, వివాహితురాలైన కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ అప్పారావు పరిశీలించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉత్తరాంధ్ర పర్యాటకంపై వీడియో పోటీలు

- 3 నిమిషాల్లో పాత/కొత్త ప్రాంతాలను పరిచయం చేయాలి
- ఏపీటీఏ, ఏపీటీడీసీ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణ
- వీడియో అప్‌లోడ్‌కు ఈ నెల 25వ తేదీ ఆఖరు



సాక్షి, విశాఖపట్నం: ప్రకృతి సోయగాలు.. మైమరిపించే అందాలు.. పరవళ్లు తొక్కే నదులు, జాలువారే జలపాతాలు.. చారిత్రక ప్రదేశాలు. ఇలా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నో ప్రకృతి రమణీయ ప్రదేశాలు, చారిత్రక ప్రాంతాలున్నాయి. ఈ పర్యాటక ప్రాంతాలను మరింత అందంగా చూపించే టాలెంట్ మీ సొంతమైతే.. అద్భుత అవకాశాన్ని కల్పిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. సందర్శనీయ ప్రాంతాలను అద్భుతమైన రీతిలో వీడియోలో బంధించి.. పర్యాటక శాఖ అందజేసే బహుమతి కొట్టేయొచ్చు. ఇప్పటివరకు ఎవరూ చూడని ప్రాంతాలను చూపిస్తే.. విజయావకాశాలు ఎక్కువగా ఉండే చాన్స్ ఉంది. మరెందుకు ఆలస్యం.. వెంటనే మీలోని సృజనాత్మకతకు పదునుపెట్టండి.!

ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని ఏపీ టూరిజం అథారిటీ(ఏపీటీఏ), ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) సంయుక్తంగా వీడియో చిత్రీకరణ పోటీలను నిర్వహిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో పోటీలు జరగనున్నాయి. ఓ పర్యాటక ప్రాంత విశేషాలు, గొప్పదనాన్ని దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా, అబ్బురపరిచేలా 3 నిమిషాల వ్యవధిలో వీడియోను చిత్రీకరించి పోటీలకు పంపాలి. ఓ ప్రాంతానికి సంబంధించిన ఓ వీడియో లేదా వివిధ ప్రాంతాలకు సంబంధించిన వీడియోలు పంపేందుకు అవకాశం ఉంది. తెలుగు లేదా ఇంగ్లిష్ భాషలో వాయిస్ ఓవర్లు తప్పనిసరి.

మొదటి బహుమతి రూ.10వేలు

పోటీల్లో మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు అందజేస్తాం. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కొత్త పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నాం. ఏపీ టూరిజం వెబ్‌సైట్ https:// aptourism. ap. gov. in/ apworldtourismday/#/ Register లో రిజిస్టర్ చేసుకోవాలి. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు వీడియోను అప్‌లోడ్ చేయాలి.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్

మీ పాపాలే మిమ్మల్ని వెంటాడుతున్నాయి


నూతన లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ధర్మాన కృష్ణదాస్

- స్కిల్ స్కామ్‌లో ఏ-2 అచ్చెన్నాయుడు
- వైఎస్సార్ పింఛను కానుక సభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: గతంలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన పాపాలే ఇప్పుడు శాపాలుగా మారి వెంటాడుతున్నాయని, చట్టం ముందు అంతా సమానులేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం జలుమూరు మండలంలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ సభలో మాట్లాడారు. నాడు టీడీపీ, కాంగ్రెస్ పార్టీలతో సహా ఢిల్లీ పెద్దలంతా ఒక్కటై జగన్‌మోహన్‌రెడ్డిని అక్రమం, అన్యాయంగా జైలు పాలు చేసి ఇష్టారాజ్యంగా దూషణలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మీ వరకూ వస్తే రాజకీయ కక్ష అని ఎల్లోమీడియా,పెయిడ్ ఆర్టిస్టుల ద్వారా ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీకి సరైన బుద్ధి చెబుతారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న బాబు రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు ఏ1 అయితే నాటి మంత్రి, టీడీపీ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఏ2 అని కృష్ణదాస్ అన్నారు. అన్ని నిజాలు త్వరలో బయటపడతాయన్నారు. అనంతరం 225 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజీ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీలు డోల నాగరత్నం, తంగి మురళీకృష్ణ, సర్పంచ్ ఇప్పిలి దుర్గ, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, పి.రాజప్పలనాయుడు, మండల సలహాదారు పైడి విఠలరావు, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మథరావు, వ్యవసాయ మండలి అధ్యక్షుడు బుక్కా లక్ష్మణరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తర్ర మాధవి, కూన రమణ, మెండ రవికుమార్, రావాడ చందనబాబు, కె.హరిప్రసాద్, వెలమల అసిరినాయుడు, నాయుకులు విజయ్, కోన దామోదరావు, బువాజీ, దుంగ ప్రసాద్, మూకళ్ల సత్యం పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కర లేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు.

అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

న్యూ సెంట్రల్ స్కూల్,
పి.ఎన్.కాలనీ, శ్రీకాకుళం.
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 95503 11265